


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### అత్తాకోడళ్ళు

**అసలు ప్రపంచంలో ఈ టాపిక్** అంత ప్రసిద్ధమైనదీ పసందుగా ఉండేదీ మరోటి లేదు.

పనంతా చేసుకుని మన ప్రియతమ నేత ఇందిరాగాంధీ, ఆకలేసి ఇంట్లో ఫ్రిజ్ తడిమితే "ఒక పండు కానీ, బ్రెడ్ ముక్క కానీ ఉంచదు సోనియా" అని, ఆవిడ దగ్గర వారి దగ్గర చిరాకు పడేదిట. పాపం ఆ అత్తకు కోడల్ని సాధించడానికి అస్సలు తీరిక దొరికేది కాదు. కానీ మిగతా వాళ్ళకి అలా కాదు కదా! "అత్తా నీ పైట తొలిగింది" అన్నా తప్పే, "అత్తా నీ పైట తొలగలేదు" అన్నా తప్పే. అని సామెత ఉంది.

అంతెందుకు లక్ష్మీదేవికి కోడలు సరస్వతీదేవి కాబట్టి, మరాఠీలో ఆ ఇద్దరి జగడం ఒక నృత్యరూపకంగా వేస్తే నేను చూసాను. దీని బట్టి ఈ అత్తా కోడళ్ళ పోరుకి దేవతలు కూడా మినహాయింపు కారని నాకు అర్థం అయింది.

అత్త గయ్యాళితనం, కోడలి నోరు లేనితనం గురించి చిన్నప్పుడు చాలా కథలు విన్నాం, చదివాం. కానీ మా అమ్మమ్మ చెప్పిన ఓ కథ మాత్రం నేను మరిచిపోలేను. అది "కాకరపాదు" కథ.

ఒకానొక ఊళ్ళో ఒక గయ్యాళి అత్త. ఆవిడకి కొత్తగా వచ్చిన ఓ కోడలు. సహజంగానే నోరులేని ఒక చవట సన్నాసి మొగుడు. వీరింట్లో ఒక కాకరపాదు ఉండేదిట. దాని నిండా కాయలు కాసి కళ్ళకి ఇంపుగా కనిపిస్తుండేదిట. ఈ అత్తా, మొగుడూ నాలుగు కాయలు తాజాగా కోసుకుని కూర వండుకుని తినేసి, కోడలికి గంజీ, పచ్చడి మెతుకులూ పెట్టేవారట. ఆ కూర తినేటప్పుడు అత్త "భలే రుచిగా ఉంది కదరా. నోట్లో వేసుకుంటే కరిగిపోతున్నాయి ముక్కలు. నీ కోసం ఎర్రగా వేయించానురా. ఇంకొంచెం వేసుకో!" అని మాట్లాడుకోవడం విని విని, కోడలి నోరు ఊరిపోయేదిట. కానీ పెట్టరు. ఒక రోజు ధైర్యం చేసి మొగుడితో రాత్రి వేళ "నాకూ కాకరకాయ కూర రుచి చూడాలని ఉందండీ" అందిట.

మొగుడు ఏ కళనున్నాడో "సర్లే మేం అన్నం తినేటప్పుడు ఆకు కింద ఓ ముక్క పెడతా. అమ్మ చూడకుండా తీసి నోట్లో వేసుకో" అన్నాడట. అన్నట్లుగానే, అలా ఆకు కింద ఓ ముక్క వదిలిపెట్టాడుట. కోడలు ఆకులు ఎత్తుతూ ఆ ముక్క తీసి నోట్లో వేసుకుందిట. అంతే! ఇంతకాలం తను ఎంత రుచికి దూరం అయిందో అర్థం అయింది ఆమెకి. ఇల్లు తుడుస్తున్నప్పుడు, పెరడు ఊడుస్తున్నప్పుడు, అంట్లు తోముతున్నప్పుడు, బట్టలుతుకుతున్నప్పుడు, ఈ కాకరకాయ కూర రుచే జ్ఞాపకం వస్తోందిట. ఇలా ఉండగా,

ఒక రోజు అత్తగారూ, మొగుడూ పొరుగూర్లో పెళ్ళికి వెళుతూ, "ఒసే మొద్దు మొహమా మేం ఊరికెళ్తున్నాం. నువ్వు ఒళ్ళు ఎరగకుండా నిద్రపోకు. ఏ దొంగాడో వచ్చి కాకరపాదు దులిపేసి పోతాడు. అసలే ఊరు అందరి దృష్టీ నా కాకరపాదు మీదే" అని చెప్పి వెళ్ళిందిట అత్త.

కోడలు ఏవైతే అది అయింది ఇంతకన్నా మంచి అవకాశం రాదని, కాకరకాయలన్నీ శుభ్రంగా కోసుకుని, తనకి ఇష్టమైనట్లు వండుకుని, పళ్ళెం నిండా పెట్టుకుని తినేసిందిట. ఆ కడుపూ, మనసూ నిండిన ఆనందంలో నిద్రొచ్చి పడుకునిపోయిందిట.

అత్తా మొగుడూ పొరుగూర్లో పెళ్ళిలో భోజనం అదీ సరిగా కుదరక, రుసరుసలాడుతూ ఇంటికొచ్చే సరికీ, తలుపులు బార్లా తెరిచి కోడలు నిద్రపోతూ కనిపించిందిట. అంతేకాదు, అత్త పెరట్లోకెళ్ళి చూసుకుంటే కాకరపాదు బోసిపోయి, కాయలు లేకుండా ఉందిట.

వెంటనే అత్త కొడుకుతో "ఇది నా మాట వినకుండా కాకరకాయలన్నీ శుభ్రంగా కోసుకుని, తినేసింది. ఇది ఇంక బతకకూడదు, పద!" అని కోడల్ని చాపలోచుట్టేసి, చీకటి పడ్డాక అడవిలోకి తీసుకెళ్ళి కాల్చేద్దాం అందిట.

చాతకాని మొగుడు తలూపాడు. చీకట్లో ఇద్దరూ ఆ చాపలో ఉన్న కోడల్ని మోసుకుంటూ, కిరసనాయిలు సీసాతో సహా అడవిలోకి వెళ్ళారు. తీరా కాల్చేద్దాం అని చూస్తే, అగ్గిపెట్టి మరిచిపోయి వచ్చినట్లు తెలిసిందిట.

అత్త కొడుకుని వెళ్ళి తీసుకురమ్మందిట. కొడుకు "ఒక్కడ్నీనా?..నాకు భయం. నువ్వూ రా అమ్మా" అన్నాడుట.

ఈలోగా మెలుకువ వచ్చిన కోడలు ఊపిరి బిగబట్టి వీళ్ళ సంభాషణ వింటోంది. తనని చంపేస్తున్నారని అర్థం అయింది.

తల్లీ కొడుకులు ఇద్దరూ నువ్వంటే, నువ్వని వంతులేసుకుని, చివరకి ఇద్దరూ కలిసి అగ్గిపెట్టి కోసం ఇంటికి వెళ్ళారుట.

'బ్రతుకు జీవుడా!' అని కోడలు లేచి, దగ్గర్లో ఉన్న చితుకులన్నీ ఆ చాపలో పోగుచేసి, యధాప్రకారం చుట్టేసి, చెట్టెక్కి కూర్చుందిట.

అత్తా మొగుడూ వచ్చాకా, అత్త చాపకి నిప్పు పెట్టింది. చితుకులూ ఎండుటాకులూ కాలుతుంటే "దీనికి బాగా అయింది. కాకరకాయ గింజలు ఎలా పేల్తున్నాయో చూడరా!" అని అత్త మురిసిపోయిందిట. మొత్తం కాలకా నిశ్చింతగా వాళ్ళు ఇంటికి వెళ్ళిపోయారుట.

కోడలు చెట్టుమీద బిక్కు బిక్కుమంటూ కూర్చుని "దేవుడా నాకేది దారి?" అని ఏడుస్తుండగా, గుర్రాల చప్పుడైందిట. నలుగురు దొంగలు గుర్రాలు దిగి, తాము దొంగిలించిన నగలు, డబ్బూ, తీసుకొచ్చి చెట్టుకింద కూర్చుని పంచుకుంటున్నారట. ఆ ప్రహసనంలో 'నాకు ఎక్కువ అంటే నాకు ఎక్కువ' అని పోట్లాడుకుంటున్నారు. ఇదంతా చూస్తున్న కోడలు, గొంతు భీకరంగా పెట్టి" మరి మావుళ్ళమ్మ వాటా ఏదిరా?" అందిట.

అంతే వాళ్ళు "ఎవరు? నువ్వెవరు?" అని అరిచారుట.

"నేను ఈ అడివినేలే భూతాన్ని. నా వాటాగా అవి వదిలి పారిపోండి. లేదా రక్తం కక్కుకుని చస్తారు" అందిట.

"ఎవరు? నువ్వెవరు?" అని అరిచారుట.

అంతే వాళ్ళు బతికుంటే బలుసాకు తినొచ్చని దౌడు తీసారుట నగలన్నీ అక్కడే వదిలేసి. కోడలు చెట్టు దిగొచ్చి ఒళ్ళంతా ఆ నగలు అలంకరించుకుని, మిగతా డబ్బూ, వజ్రవైఢూర్యాలూ సంచితో మోసుకుంటూ ఇంటికెళ్ళిందిట.

ప్రొద్దుటే తలుపు చప్పుడు అవుతుంటే, తలుపు తీసిన అత్త, ఒళ్ళంతా నగలతో ఉన్న కోడల్ని చూసి బిత్తరపోయి "నువ్వు చావలేదా?" అని అడిగిందిట.

కోడలు నవ్వి "అత్తయ్యా చచ్చాను నేను స్వర్గానికి వెళ్ళేసరికి అక్కడ మావగారు నన్ను చూసి, మీ క్షేమ సమాచారాలు అడిగి, మీరు వస్తే ఇంకా చాలా నగలు ఇస్తానని చెప్పి, ఇవన్నీ నాకు ఇచ్చి పంపారు. మీ కోసం ఎదురు చూస్తున్నారు అత్తయ్యా త్వరగా వెళ్ళండి" అందిట.

సొమ్ము చూసి కళ్ళు వెలిసిపోతూ ఉండగా అత్త "ఎలాగే స్వర్గానికి వెళ్ళి మీ మావగార్ని కలవడం?" అందిట.

"నేను వెళ్ళినట్లే అత్తయ్యా ఏవండీ చూస్తారేం? మీ అమ్మని చాపలో చుట్టి, చీకటి పడగానే అడవికి తీసుకెళ్ళి కాల్చేద్దాం" అందిట.

మొగుడు సరేనని "నగలు తీసుకుని వచ్చేసెయ్" అని పెళ్ళాం చెప్పినట్లే తల్లిని చాపలో చుట్టేసి, చీకట్లో తలమీద పెట్టుకుని అడవికి తీసుకెళ్ళాడు. కోడలు ఈసారి అగ్గిపెట్టి మరిచిపోకుండా, కిరసనాయిలు సీసాతో సహా వెనకే వెళ్ళింది. సరిగ్గా కోడల్ని ఎక్కడ దించారో అక్కడ దింపి, కాల్చేసారు. అత్తగారు కుయ్యో మొర్రో అంటున్నా వినిపించుకోలేదు.

"వెనక్కి తిరిగి చూడకుండా పోదాం" అని కోడలు ఇంటికి తీసుకొచ్చేసింది.

రోజూ కాకరకాయ కూర వండుకుంటూ హాయిగా ఉంది. కొడుకు ఒక రోజు పెళ్ళాంతో "అమ్మ ఇంకా రాలేదేం?" అన్నాడు.

"ఎందుకండీ రావడం? ఈ వయసులో మావగారూ, అత్తగారూ కలిసి సుఖంగా ఉండకుండా? వాళ్ళని అలా ఉండనీయండి" అంది కోడలు.

దాంతో అతనూ 'నిజమే' అనుకుని అడగడం మానేసాడు.

అత్త తిరిగిరాని లోకాలకి వెళ్ళిపోయింది అసలీ కథ చెప్పకపోతే, చిన్నప్పుడు మేం కాకరకాయ కూర తినేవాళ్ళమే కాదు. అలాగే నా పిల్లలూ కాకరకాయ కూర చేస్తే "అమ్మా అత్తగారి కథ చెపితే తింటాం" అనే వాళ్ళు.

మొన్న ఈ కథ కాకరకాయకూర వడ్డిస్తూ మా సినిమా దర్శకుడికి చెప్పా. ఎంతో ముచ్చటపడి ఇంటికి వెళ్ళి వాళ్ళ ఆవిడకి చెప్పాడు. ఆవిడ తన ఫ్రెండ్స్‌కి. ఇలా ఈ కాకమ్మ కథలు వినడానికి ఎంతో బావుంటాయి. ఇందులో కోడల్ని హింసించకూడదు అనే నీతి కూడా ఉంది. అందుకే చెడు చేస్తే నాశనం అయిపోతారు అని పిల్లలకి ఇలాంటి నీతి కథలు చెప్పేవారు.

మొన్న ఆదివారం 'సత్యమేవజయతే'లో అమీర్ ఖాన్ కట్నాలు - పెళ్ళిళ్ళ సమస్య చూపిస్తూ, అత్తగారింటి వేధింపులు గురించి ప్రస్తావించాడు.

ఇప్పటికీ మన సభ్య సమాజంలో చదువుకున్న నాగరీకులు కూడా కొంతమంది కట్నం తేలేదని కోడల్ని చంపెయ్యడం, హింసించడం, మొగుళ్ళు కూడా భార్యలకి నరకం చూపెట్టడం చూసినా, విన్నా, వీరి మానసిక మనస్థితి ఏవైవుంటుందీ అని నాకు చాలా వింతగా అనిపిస్తుంది. ఒక మనిషిని డబ్బు కోసమో, ఆస్తికోసమో బ్రతికుండగా కాల్చెయ్యడం, ఇంకోలా చంపెయ్యడం (నిరక్షరాస్యుల్నీ, వెనకబడ్డ గ్రామాల వారినీ వదిలేస్తున్నావు) ఈ నవనాగరీక సమాజంలో ఎంత ఆశ్చర్యం? మన ఇంటికి తన తల్లితండ్రుల్నీ, పెరిగిన వాతావరణాన్నీ వదిలి, కొత్త బంధాలు ఏర్పరచుకుంటూ వస్తున్న అమ్మాయి మన అబ్బాయి ఈడుదే, మన ఇంటి అమ్మాయిలాంటిదే, ఆమెని ప్రేమగా ఆహ్వానించి, మన వంశాన్ని నిలబెట్టి, మనతో కలకాలం ఉండేట్లు చేసుకోడానికి, కొంత సర్దుకుని, కొంత శ్రమించి ఆ బంధాన్ని అనుబంధంగా తీర్చిదిద్దుకోవాలిగా.

నేను ఖాళీగా ఉన్నప్పుడు హిందీ టీ.వీ సీరియల్స్ చూస్తాను. ఏ సీరియల్‌లో అయినా, ఒళ్ళంతా నగలతో, పెద్ద పట్టుచీరలు ఉన్న అత్త అరుస్తూనే ఉంటుంది. కోడలు ఒదిగిపోతూ ఉంటుంది. ఓ వెయ్యి ఎపిసోడ్లు లాగేస్తారు. దీనివల్ల సమాజానికి ఎంత చెడు జరుగుతుందో ఊహించరు. "కైరీ" అని కలర్స్ ఛానెల్‌లో ఓ సీరియల్ వస్తుంది. అందులో విమర్తీ దేవీ అనే అత్త కోడలు దూరాన ఉన్న మొగుడుతో సెల్‌ఫోన్ లో మాట్లాడిందని, రెండువేళ్ళ మధ్యా సెల్ పెట్టి రక్తం వచ్చేట్లు నొక్కేస్తుంది. కొడుకుకి హారతి ఇచ్చిందని,

కాలిమీద తన కాలు వేసి బలంగా తొక్కేస్తుంది. ఇంకో సోనీ సీరియల్ 'శుభవివాహ్'లో అత్తగారు కొడుకుకి అక్రమ సంబంధం ఉంది ఓ వివాహితతో అని తెలిసీ పెళ్ళి చేస్తుంది. ఆ వచ్చిన పెళ్ళి కూతురి మీద అన్నింటికీ విరుచుకు పడుతూ, కొడుకు చేత కొట్టిస్తుంటుంది. వాడు బయట తిరిగొచ్చి, ఇంట్లో ఉన్న పెళ్ళాన్ని చచ్చేట్లు కొడుతుంటాడు 'అమ్మ' సెంటిమెంటుతో చచ్చిపోతుంటాడు.

వీటికి భిన్నంగా 'బాలికా వధూ' వస్తుంది ఇదే కలర్స్ ఛానెల్‌లో. మొన్నటికి వెయ్యి ఎపిసోడ్లు అయ్యాయి. బాల్యంలో పెళ్ళి జరిగి, యుక్త వయసు వచ్చాక, ఆ అమ్మాయిని భర్త వదిలేసి సాటి డాక్టర్‌ని పెళ్ళి చేసుకుంటాడు.

భర్త వదిలేసినా, చిన్నప్పుడనగా తెచ్చి పెంచిన ఆ అమ్మాయిని అత్తగారూ, మావగారూ, మావగారి తల్లీ, పెద్ద మావగారూ, అత్తా, ఆడబిడ్డా ఎవరూ వదలరు. ఆమె తమ కళ్ళముందే తమ కొడుకు చెంపలు వాయిస్తుంటే సంతోషిస్తారు. ఆస్తిలో ఆమెకీ భాగం ఉంది అంటారు. ఆమెకి బాసటగా నిలుస్తారు. గ్రామ సర్పంచ్‌ని చేస్తారు. విడాకులు ఇప్పించి, విముక్తి ప్రసాదించి, వేరే పెళ్ళి చెయ్యడానికి సంబంధాలు చూస్తారు.

తలలమీద నుండి ముసుగులు వేసుకుని, పల్లెటూరి ఖాన్‌దాన్‌కి చెందిన ఆ జమిందార్లని, నవయుగం వైపు, ప్రగతి పథం వైపు నడిపిస్తున్నాడు ఆ రచయితా, దర్శకుడు.

ఇంకా ఇంకా మూర్ఖత్వాలని ప్రకోపింపచేసే, హింసాత్మకమైన సీరియల్స్ రాకూడదు. ఇదంతా నాణేనికి ఒకవైపు.

ఇంకో వైపు ఈ మధ్య మనం కొన్ని కథలు చదువుతుంటే వాస్తవాలు తెలుస్తున్నాయి.

అమ్మాయిలు పెళ్ళి అవగానే భర్త తమ చెప్పుకింద తేలులా ఉండాలనీ, అతని వైపు వాళ్ళందర్నీ, వీలైతే అమ్నేసియా వచ్చినట్లు మర్చిపోవాలనీ భావిస్తున్నారట. ఇప్పుడు ఈ ఆధునిక పరిజ్ఞానం, వెర్రితలలు వేస్తున్న నాగరికతా, పెళ్లైన కొత్తల్లోనే అత్తవారిని బెదిరించేస్తోంది. మాట్లాడితే "గృహహింస కింద కేసు పెడితే, మీ అమ్మా, నాన్నా, అక్కా అందరితోబాటూ, నువ్వూ జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందే ఖబడ్దార్" అని బెదిరిస్తున్నారట.

ఈ మధ్య సుప్రీం కోర్టు"ఆస్తిలోనే కాదు భరణం, విడాకులు ఇస్తే జీవితకాలం అతని సంపాదనలో ఆమెకి భాగం ఇవ్వాల్సిందే" అని సరికొత్త సవరణ చెయ్యడం వలన కుర్రాళ్ళు పెళ్ళంటే దడుసుకుంటున్నారు.

మా ఫ్రెండ్ కోడలు పెళ్ళయి భర్తతో ఇటలీ వెళ్ళింది. అక్కడ వాడు ఓ పార్టీకి రాను అన్నందుకు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిందట. ఫారిన్‌లో చట్టాలు ఇక్కడకన్నా పటిష్టం. వాడు సైంటిస్ట్. తన పరిశోధనలు అన్నీ ఆపేసి జైలులో పెడతారని భయపడి ఆమె చెప్పినట్లు వింటున్నాడు. మొన్న అనకాపల్లిలో ఉన్న అత్తకూతురి పెళ్ళికి "నువ్వు వెళ్ళు. నాకు రావడానికి వీలవదు" అన్నాడని పాస్‌పోర్ట్ సీజ్ చేయిస్తానని బెదిరించిదట. ఇవన్నీ టీవీలు, ఇంటర్నెట్ ఇచ్చిన ఎవేర్‌నెస్.

ఇంక పెళ్ళికి ముందే "మాకు బాయ్ ఫ్రెండ్స్ ఉన్నారు . ఉంటారు ఎప్పటికీ" అని చెప్పే అమ్మాయిలు.

బోలెడు ఖర్చు పెట్టి ఎంగేజ్ మెంట్ చేసాక, పాత లవర్ వచ్చాడని ఈ ఎంగేజ్‌మెంట్‌ని గడ్డిపరకలా తీసిపారేసి, 'బ్రేక్‌అప్' ప్రకటించిన వారివీ రెండు మూడు కేసులు చూసాను.

బామ్మలు ఉంటే "మా వాడు బంగారం వాడిని ముద్దుగా పెంచాం తల్లీ" అంటే తప్పట.

తల్లి పెళ్ళి అయ్యాకా కొడుక్కి ప్రేమగా అన్నం కలిపి తినిపిస్తే క్రైమ్'ట. నలుగురైదుగురు స్నేహితురాళ్ళు కొడుకుల పెళ్ళిళ్ళు అయ్యాకా, మొహాన వెలుగులేకుండా, నిర్జీవంగా తయారయి కనిపించారు. ఏవిటి విశేషాలు అంటే, మనం పెదవి విప్పకుండా, కోడళ్ళ ముందు ఎంత ఒద్దికగా ఉండాలో వివరించారు. మేలో పెళ్ళయిన అమ్మాయి జూలైలో "మీ అబ్బాయి పద్ధతులన్నీ మార్చేస్తాను. అసహ్యంగా పెంచారు. అస్సలు మోడ్రెన్ థాట్స్ లేవు" అని మావగారితో చెప్పడం నేను విన్నాను.

ఇంక ఆడపిల్లల తల్లిదండ్రులు వేషభాషలతో కొంత శ్రద్ధ తీసుకోవాలి. పెళ్ళికాకముందు తొడల మీదకి నిక్కర్లూ, లోతు మెడలతో బనీన్లు, తప్పులేదని అలవాటు చేస్తే, వాళ్ళు అలాగే అలవాటు చేసుకుంటారు పాపం. కానీ పెళ్ళయిన కోడలు మావగారి ముందు కురచ బట్టలతో, నిక్కరుతో వచ్చి కూర్చుని "హాయ్ అంకుల్ గివ్ దట్ న్యూస్ పేపర్ ప్లీజ్" అన్నప్పుడు ఇబ్బందిగా అనిపిస్తుంది. అలాగే ఇప్పటి అమ్మాయిల నుండి వంట ఎక్స్‌పెక్ట్ చెయ్యడం అత్యాశకానీ కొంత మాటలో నమ్రతా, ఆప్యాయతా ఆశించడంలో తప్పులేదుగా. భర్తని వంటరిగా ఉన్నప్పుడు ఏమైనా అనుకోవచ్చు. అది వారి 'ఇంటిమసీ'ని బట్టి ఉంటుంది. కానీ రిజిస్టర్ ఆఫీస్‌లోనే సంతకాలు అయ్యాకా భర్త పిలుస్తుంటే, ఇంకో అబ్బాయితో కబుర్లు చెపుతూ "అరె మేన్. వై కాన్ట్ యూ వెయిట్ ఫర్ సమ్ టైమ్. కాంట్ యూ సీ ఐయామ్ బిజీ విత్ సమ్ బడీ ఎల్స్? " అనడం నేను ఓ చోట విన్నాను. ఆ భర్త ఏం చెయ్యలేక వెర్రి నవ్వు నవ్వాడు. ఇంకో కోడలు" వాడు ఏం చెప్పినా సరిగ్గా చెయ్యడు" అని మొగుడి గురించి ఫోన్లో ఇంకో ఫ్రెండ్‌కి చెప్పడం విని పాపం ఆ అత్త నా దగ్గర బాధపడింది. మారే రోజుల్లో మారిపోతున్న విలువలు. పోనీ వాళ్లైనా సుఖంగా ఉంటున్నారా? ఇన్సెక్యూరిటీ, ఇన్ఫీరియారిటీలతో సతమతమౌతున్నారు. ఇద్దరూ సంపాదించడం, ఇద్దరూ ఈక్వెల్‌గా చదువుకోవడం, ఒక ఫ్లాట్, ఇంట్లో ఫర్నీచర్, తిరగడానికో కారూ, ఇవన్నీ కావు ఇల్లంటే.

**ఇల్లంటే ఒక నిశ్చింత!**

**రాత్రి పెట్టెలో మనం దాచుకునే కలల సముదాయానికి రూపం.**

**మనకీ మనవాళ్ళకీ మధ్య ప్రేమదారంతో మనం గుచ్చి కూర్చే అనురాగమాల...**

**అటు అమ్మాయి తల్లితండ్రులూ బంధువులూ ఇటు అబ్బాయి తల్లితండ్రులూ, సన్నిహితులూ అందరూ తలో చెయ్యేవేసి ముందు తరాలకోసం నిర్మించే ఆశలగూడు.**


**అమ్మాయి పెళ్ళంటే ఆమె తండ్రికి అప్పూ, అబ్బాయి పెళ్ళంటే అతని కన్నవారికి జైలూ గుర్తురాకూడదు.**

**పెళ్ళంటే భయం పోవాలి.**

**సర్వేజనా సుఖినోభవంతు**

●●●

Click here to share your comments on this story.


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
2007
చలన చిత్ర నంది బహుమతులు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
సాహితి
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి